క్లుప్తంగా

16న లక్ష్మీ కుభేర సామూహిక లక్ష కుంకుమార్చన

ఆసిఫాబాద్: కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో ఈ నెల 16న లక్ష్మీ కుభేర సామూహిక లక్ష కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు రాచకొండ నాగేశ్వర్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగజ్‌నగర్‌కు చెందిన వేదపండితులు బాచంపెల్లి కమలాకర్ శర్మ ఆధ్వర్యంలో శృంగేరి శారదా పీఠ ఆస్థాన పౌరాణికులు, భారతీయ తీర్థ పురస్కార గ్రహీత బ్రహ్మశ్రీ బాచంపెల్లి సంతోష్ కుమార్ శాస్త్రి, తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన బ్రహ్మశ్రీ దోర్బల ప్రభాకర శర్మ పర్యవేక్షణలో 16 మంది రుత్వికులతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుంకుమార్చనలో పాల్గొనాలనుకునే భక్తులు మొబైల్ నంబర్లు 95533 94929, 96521 65639లలో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా కుమురం సూరు వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని కుమురం సూరు విగ్రహం వద్ద ఆదివారం ఆయన 28వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి సాంప్రదాయ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చౌపన్‌గూడ మాజీ సర్పంచ్ సీడం అన్నిగా, కొలాం సంఘం నాయకులు ఆత్రం బాపురావు, కుమురం లింగు, మడావి నాగోరావు, ఆత్రం తుకారాం, భీంరావు, పోతు, కట్టి తదితరులు పాల్గొన్నారు.

ఆయా పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని కోయవాగు ఎఫ్ క్వార్టర్స్ గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల (ఉర్దూ మీడియం) లో ఆయాగా పని చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో వాసాల ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 44 ఏళ్ల లోపు ఉన్న మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, స్థానిక గ్రామ పంచాయతీ, సమీప గ్రామ పంచాయతీకి సంబంధించిన వారై ఉండాలన్నారు. 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, స్థానికత, మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, ఎక్స్‌సర్వీస్ ఉమెన్‌కు 3 సంవత్సరాలు, దివ్యాంగ మహిళలకు 10 సంవత్సరాల వయస్సు సడలింపు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 16వ తేదీలోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇప్ప పోచయ్యకు ఉత్తమ టీచర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న పోచయ్య

రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని విశ్వశాంతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాంటెండెంట్ ఇప్ప పోచయ్య ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ట్రస్మా ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇప్ప పోచయ్య తెలంగాణ స్టేట్ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఇటికల పురుషోత్తం చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న సేవలను గుర్తించి అవార్డును అందించడంపై హర్షం వ్యక్తం చేశారు.

'భీం ఆశయ సాధనకు కృషి చేయాలి'

నార్నూర్: ఆదివాసీల హక్కుల సాధన కోసం వీరోచిత పోరాటం చేసిన కుమురం భీం ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆదివాసీ జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావులు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద దసరా ఉత్సవాలు నిర్వహించారు. మాన్కాపూర్ గ్రామస్తులు కాలినడకన కుమురం భీం భవన్‌కు చేరుకొని, జెండా ఆవిష్కరించారు. అనంతరం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్లాలంటే చదువు ఒకటే మార్గమన్నారు.

పత్తి పంటపై దుమ్ము!

- కంకర తేలిన రోడ్డుతో తిప్పలు
- వాహనాల రాకపోకలతో వ్యాపిస్తున్న దుమ్ము, ధూళి
- దిగుబడులపై ప్రభావం
- పత్తి నాణ్యత కోల్పోయే ప్రమాదం



కంకర తేలిన టోకెన్‌మోవాడ్ రోడ్డు



రోడ్డు పక్కన పత్తి చేను

కెరమెరి: మండలంలోని జోడేఘాట్ నుంచి హట్టి వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా పత్తి పంట సాగు చేస్తున్న రైతులు రోడ్డుపై లేస్తున్న దుమ్ముతో ఆందోళన చెందుతున్నారు. పత్తి పంట, పిందె దుమ్ముతో నిండిపోతుండడంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని వాపోతున్నారు. పత్తి పంట వేసిన దగ్గర నుంచి ఇప్పటి వరకు కూడా రోడ్డు నిర్మాణం అసంపూర్తిగానే ఉండడంతో పగిలిన పత్తి పంటకు అనుకున్న ధర రావడం కష్టమని రైతులు భావిస్తున్నారు. సగం వరకే రోడ్డు నిర్మించి మిగిలింది అటవీ అధికారుల అనుమతి లేదని నిలిపివేయడంతో ఇబ్బంది తప్పడం లేదు. ఇటీవల జోడేఘాట్‌లో జరిగిన కుమురం భీం 85వ వర్ధంతికి అనేక వాహనాలు రాకపోకలు సాగించాయి. వీటితో మరింత దుమ్ము, ధూళి లేచి పంటలపై విస్తరించింది.

నాణ్యత కోల్పోనున్న పత్తి..

మండలంలోని జోడేఘాట్ నుంచి హట్టి వరకు కొనసాగుతున్న డబుల్‌రోడ్డు నిర్మాణం టోకెన్‌మోవాడ్ వరకే చేపట్టడంతో మిగిలిన రోడ్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. టోకెన్‌మోవాడ్ నుంచి హట్టి వరకు ఉన్న రోడ్డు నిర్మాణం జరగకపోవడంతో ఆ రోడ్డు పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి పక్కనున్న పంటలపై పడడంతో పంటలు దెబ్బతింటున్నాయి. ఇప్పటికే చాలా చోట్ల రోడ్డుకిరువైపులా ఉన్న పత్తి పొలాల్లో పత్తి పంట పగిలేందుకు సిద్ధంగా ఉంది. కొన్ని చోట్ల చేనులో పత్తి పగిలి ఉంది. దుమ్ము పగిలిన పత్తిపై పడితే రంగు మారే ప్రమాదం ఉంది. దీంతో మార్కెట్‌లో ఉన్న ధర పత్తికి రాకపోవచ్చని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టోకెన్‌మోవాడ్ నుంచి హట్టి వరకు అనేక ఎకరాలు సాగు భూమి ఉంది. ప్రధానంగా పత్తి పంటతో పాటు అంతర పంటగా కంది పంట వేశారు. కానీ ప్రస్తుతం దుమ్ము, ధూళి వల్ల కొంత పంట నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో చాలాసార్లు మిగిలిన రోడ్డును కూడా పూర్తి చేయాలని అధికారులను వేడుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది.

రోడ్డు పనులు ప్రారంభించాలి



టోకెన్‌మోవాడ్ నుంచి హట్టి వరకు నిలిచిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి. అటవీశాఖ అనుమతులు ఇవ్వాలి. రోడ్డుపై లేస్తున్న దుమ్ముతో సమీపంలోని పంట పొలాలు దెబ్బతింటున్నాయి. ఇటీవల జిల్లా అధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదు.

– పెందోర్ రాజేశ్వర్, పోరుగ్రామాల అధ్యక్షుడు

గిరిజన వీరుడు కుమురంభీంకు నివాళి



సాకడ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న ఆదివాసీలు



కెరమెరిలో డప్పుచప్పుళ్లతో వస్తున్న ఆదివాసీలు



కౌటాల: కుమురం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

- సాకడ చౌరస్తాలో ఘనంగా కుమురం భీం వర్ధంతి

కెరమెరి: మండలంలోని సాకడ చౌరస్తాలో ఆదివారం గిరిజన వీరుడు కుమురం భీం 85వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఆదివాసీలు ఢోలు సన్నాయి వాయిస్తూ సాంప్రదాయ రీతిలో అత్యంత ఘనంగా, కనుల పండువగా సాకడ చౌరస్తాకు చేరుకొని కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భాజా భజంత్రీలతో ప్రధాన రోడ్డుపైకి వచ్చి జెండా ఎగురేశారు. ఆదివాసీ సమాజానికి కుమురం భీం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్. మధుకర్, మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెందోర్ ఆనంద్ రావు, ఆదివాసీ నాయకులు దంబిరావు, మడావి రఘునాథ్, ఆర్ఎస జంగు, పెందోర్ జలపతి, కుమురం అంబారావు, కుమురం లాల్‌శావ్, శ్రీనివాస్, తుకారాం, సోము తదితరులు ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: పోరాట యోధుడు కుమురం భీం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య అన్నారు. కుమురం భీం 85వ వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని వీర్దండి గ్రామంలోని కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమురం భీం జల్ జంగల్ జమీన్ నినాదాంతో గిరిజనుల విముక్తి కోసం నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కుమురం భీం వర్ధంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం మంచి విషయమన్నారు. గురుడుపేట, జనగాం గ్రామాల్లో వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ మడావి రేణుక, నాయకులు బండు, పత్రు, సుధాకర్, మారుతి, చరణ్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

బెజ్జూర్: మండలంలోని సలుగుపెల్లి గ్రామానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ కురిసింగుల ఓంప్రకాశ్, సులుగుపల్లి గ్రామానికి చెందిన గోండ్వానా కోయ సంఘం జిల్లా అధ్యక్షుడు సోయం చిన్నన్న, బీజేపీ మండల నాయకుడు సిడం ఫకీరు కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం వారికి కోనప్ప కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బెజ్జూర్ మాజీ మండల కోఆప్షన్ మెంబర్ బషరత్ ఖాన్, మాజీ ఎంపీటీసీ కుమురం హనుమంతు, ఇంజిరి రాజారాం, పుల్లూరి సతీశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు..

మండలంలోని సోమిని గ్రామం నుంచి కుష్ణపల్లి గ్రామం వరకు ఉన్న మట్టి రోడ్డు వర్షాకాలంలో గుంతలమయంగా మారింది. సమస్య కోనప్ప దృష్టికి వెళ్లడంతో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని నాయకులు, కార్యకర్తలను ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యే సూచన మేరకు ఆదివారం శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు ప్రారంభించారు. అనంతరం కోనేరు కోనప్ప రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

'సమాజం కోసం పని చేయడం అభినందనీయం'



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి

కాగజ్‌నగర్‌టౌన్: సమాజం కోసం విద్యార్థులు గ్రామాల్లో పనిచేయడం అభినందనీయమని ఎస్‌కేఈ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి అన్నారు. ఆదివారం సిర్పూర్(టి) మండలంలోని వేంపల్లి గ్రామంలో ఎస్‌కేఈ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గత ఏడు రోజులుగా నిర్వహిస్తున్న సామాజిక కార్యక్రమాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో వారం రోజుల పాటు గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు ఇతర కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఆదివారం ముగింపు కార్యక్రమం సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, వలంటీర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తూడురు దత్తాత్రేయలను అభినందించారు. సీనియర్ న్యాయవాది కిషోర్‌కుమార్, ఎంపీడీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ దుర్గం జనార్దన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

భీంపూర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కరంజి, గిర్గాం, ధనోర గ్రామాల్లో గర్భిణులకు రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ గర్భకోశ వైద్య నిపుణులు డా. విజయసారథి శ్రీనివాసన్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. తల్లి, బిడ్డ సురక్షిత కాన్పులకోసం మాతా శిశు సంరక్షణ రికార్డులో నమోదు చేసిన ఆసుపత్రులకు వెళ్లాలని సూచించారు. తాజా ఆకుకూరలు, సంపూర్ణ పోషకాహార ప్రాధాన్యత, సకాలంలో పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో పాల్గొనాలన్నా రు.

విద్యార్థుల జలకాలాట!



కెరమెరి: పాఠశాలలకు శని, ఆదివారాలు సెలవులు కావడంతో విద్యార్థులు సరదాగా జలకాలాడుతున్నారు. మండలంలోని కెస్లాగూడకు చెందిన పాఠశాల విద్యార్థులు సమీపంలోని అమ్మన్నమడుగు ప్రాజెక్టులో ఈత కొడుతూ కన్పించారు. కాగా ప్రాజెక్టుల్లో లోతైన ప్రదేశాలు ఉంటాయని, ఈత కొడుతున్నప్పుడు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

బురదమయం.. మార్కెట్ ముఖద్వారం



కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ ముఖ ద్వారం ఎదుట గుంతలు ఏర్పడి బురదమయంగా మారడంతో యార్డుకు వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గేటు ముందు గుంతల్లో బురద నీరు నిలిచి ఉండడంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడిపోతున్నారు. సంబంధిత అధికారులు మార్కెట్ యార్డు గేటు ఎదుట రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్డు!



కంకర తేలిన పెంచికల్‌పేట్ -సలుగుపల్లి రహదారి

- గుంతలమయంగా పెంచికల్‌పేట్ - సలుగుపల్లి రహదారి
- ప్రయాణానికి తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ నుంచి సలుగుపల్లి వెళ్లే ప్రధాన రహదారిపైన పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మించిన నాటి నుంచి నేటి వరకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ఈ మార్గంలో వెళ్లే ద్విచక్రవాహనదారులు, ఆటోల్లో ప్రయాణించే ప్రయాణికులు అవస్థలు పడుతూ గమ్యానికి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

15 కిలోమీటర్లు.. గంట ప్రయాణం..

పెంచికల్‌పేట్ నుంచి సలుగుపల్లి వరకు 15 కిలోమీటర్ల బీటీ రహదారి ఉంది. గుంతలమయంగా ఉన్న ఈ రోడ్డు గుండా ప్రయాణం చేయడానికి సుమారు గంటకు పైగా సమయం పడుతోంది. అత్యవసర సమయంలో 108 అంబులెన్సులు సైతం నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. కాగజ్‌నగర్ నుంచి పెంచికల్‌పేట్ మీదుగా ఆర్టీసీ సర్వీసులు నడుస్తున్నాయి. గుంతలమయంగా మారిన రహదారిపైన ప్రయాణం చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయాల్సిన అధికారులు అటువైపుగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అష్టకష్టాలు పడుతూ ప్రయాణం సాగిస్తున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రధాన రహదారికి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



ప్రధాన రహదారిపైన ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు చేరడంతో ప్రమాదకరంగా మారాయి. వీటి కారణంగా ప్రయాణానికి, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఆటోల్లో ప్రయాణించే పరిస్థితి కూడా ఉండడం లేదు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ఇక్కట్లు తొలగించాలి.

– సల్మాన్, పెంచికల్‌పేట్

కంకలమ్మ జాతర విజయవంతం చేయాలి



కంకలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కౌటాల: మండల కేంద్ర సమీపంలోని గుట్టపై గల స్వయంభూ శ్రీ కేతేశ్వర -కంకలమ్మ దేవి ఆలయ మహాజాతరను జిల్లాలోని భక్తులు విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కంకలమ్మ ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు కంకలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 16, 17వ తేదీల్లో మండల కేంద్రం సమీపంలోని ఎత్తయిన గుట్టపై ఉన్న శ్రీ కేతేశ్వర స్వామి -కంకలమ్మ దేవాలయంలో జాతర ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. కంకలమ్మ జాతర సందర్భంగా జాతర మహోత్సవ ఏర్పాట్లను శరవేగంగా పూర్తిచేస్తామని తెలిపారు. ప్రతీ సంవత్సరం కార్తీక మాసం చివరి ఆదివారం మహాజాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ జాతరకు తెలంగాణ ప్రాంతంతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన భక్తులు భారీగా వస్తారని తెలిపారు. కార్యక్రమంలో మేదరి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రతాపగిరి శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉప్పుల సత్తయ్య, కమిటీ సభ్యులు కల్యాణి, విలాస్‌గౌడ్, నరేశ్, తిరుపతి, లాహను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్టీఐ అమలు దినోత్సవం



దరఖాస్తులను విడుదల చేస్తున్న ఆర్టీఐ యాక్టివిస్టులు

కాగజ్‌నగర్‌టౌన్: సమాచార హక్కు రక్షణ చట్టం, 2005 సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలో సమాచార హక్కు చట్టం అమలు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆర్టీఐ యాక్టివిస్ట్, ఎన్సీఆర్‌హెచ్‌ఆర్డీ ట్రైనర్ అశ్రఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కొండగుర్ల కమలాకర్‌లు మాట్లాడుతూ ప్రజల చేతిలోని శక్తివంతమైన ఆర్టీఐ అస్త్రం బలహీనమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం పొందడం ప్రతీ ఒక్క పౌరుని రాజ్యాంగ బద్ధమైన హక్కన్నారు. సహ చట్టం దేశంలో 20 సంవత్సరాలుగా అమలవుతున్నప్పటికీ సహచట్టం అమలు, బలోపేతంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమవుతుందని పేర్కొన్నారు. చట్ట నిబంధనల ప్రకారం దరఖాస్తు దారులకు పీఐవో, ఏపీఐవోలు సమాచారం అందించడం లేదన్నారు. ఆర్టీఐ కార్యకర్తల వివరాలు బహిర్గతమవుతున్నాయని, దీంతో వారిపై దాడులు జరుగుతున్నాయని వాపోయారు. ఆర్టీఐ కార్యకర్తల పరిరక్షణకు, ప్రజల రాజ్యాంగ బద్ధమైన హక్కుల కోసం ప్రతీ ఒక్క ఆర్టీఐ, సామాజిక కార్యకర్తలు మేధావులు ఒకే వేదికపైకి వచ్చి కృషి చేయాల్సిన అవసరముందన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆర్టీఐ కార్యకర్త అజీం పేరుతో జాగృతి యువమంచ్ ఆధ్వర్యంలో రూపొందించిన సమాచార హక్కు చట్ట దరఖాస్తులను విడుదల చేశారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడు కబీర్, జిల్లా కార్యదర్శి ప్రవీణ, అడ్వైజర్ కృష్ణ, జిల్లా ప్రచార కార్యదర్శి శ్రీనివాస్, కాగజ్‌నగర్ డివిజన్ సెక్రటరీ అఖిలేష్, దామోదర్, ఆర్టీఐ కార్యకర్తలు శరత్‌చంద్ర, ఫయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.